
# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 03 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4

వివరాలు 4వ పేజీలో

## ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి


తీర్మానానికి అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం...

ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి

### మూసీ కాలుష్యం కంటే

# కొందరి కడుపుల్లో విషం ప్రమాదం

- ఓ పక్క మూసీ..మరోపక్క ఫ్లోరైడ్‌తో నల్లగొండ జిల్లా ప్రజలకు శిక్ష
- గోదావరి నుంచి 20 టీఎంసీలు తీసుకొస్తాం
- తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీలు వాడుతాం
- మూసీలో ఐదు టీఎంసీలను నిరంతరం పారిస్తాం
- అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తాం
- గుజరాత్, యూపీల్లో బీజేపీ ప్రభుత్వాలు నదుల ప్రక్షాళన చేస్తుంటే అడ్డుకుంటున్నామా?
- హైదరాబాద్ అభివృద్ధికి మూసీ నది కీలకం
- గోదావరి జలాలతో మూసీకి శాశ్వత నీటి పరిష్కారం
- తెలంగాణలో బీజేపీ ఎందుకు అడ్డుకుంటున్నది?
- మార్చి 31లోగా అంచనాలు పూర్తి చేసి టెండర్లు పిలిచే లక్ష్యం
- ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి రూ.4,000 కోట్ల రుణం
- రియల్ ఎస్టేట్ ఒక ఇండస్ట్రీ.. మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- మూసీ పునరుజ్జీవంపై శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

'మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపుల్లో దాగి ఉన్న విషం అత్యంత ప్రమాదకరం. ఎందుకు విషం కక్కుతున్నారు. వారి కండ్లల్లోనూ విషముంది. వాటితో చూస్తే ఖతమే. దానిని కప్పిపుచ్చుకోవడానికి కండ్లద్దాలు పెట్టుకుంటున్నారు. వివరాలు చెబుతుంటే కోపం ఎందుకు వస్తుంది? మీ సభ్యులైన అంబర్‌పేట్, ఉప్పల్ ఎమ్మెల్యేలు సహకరిస్తమంటున్నారు. వారిని చూసైనా బుద్ధి తెచ్చుకోండి. అసలు మీరు మూసీ ప్రక్షాళన చేయాలంటున్నారా? వద్దంటున్నారా? చెప్పండి. వాళ్లకు చేయొద్దని ఉంది. అంబర్‌పేట శ్మశానవాటిక నుంచి మృతదేహాలు కొట్టుకొస్తుంటే, కంపెనీల కాలుష్యం వస్తుంటే దాని మధ్యే పేదలు ఎల్లకాలం నివసించాలా? ఇది మీకు పట్టదా? కాంట్రాక్టులు ఇచ్చుడు..కమీషన్లు కొట్టుడు..ఫామ్‌హౌజ్‌లలో పోయి పండేటోళ్లకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. మేం 80 వేల పుస్తకాలు చదవలేదు. డీపీఆర్ పూర్తయ్యాక మూసీ ప్రక్షాళనపై సభలో చర్చిస్తాం. అందరి అభిప్రాయాలు తీసుకుంటాం. హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేలతో మాట్లాడుతాం. ఇలా అందరి అభిప్రాయాలను తీసుకునే ముందుకెళ్తాం' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. 'గుజరాత్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్‌కోసం అక్కడి బీజేపీ ప్రభుత్వం 60 వేల కుటుంబాలను తరలించింది. యూపీలో గంగా ప్రక్షాళన చేపట్టారు. ఇప్పుడు ఢిల్లీలో యుమునా నది ప్రక్షాళన కోసం పని మొదలుపెట్టారు. గుజరాత్, యూపీ, ఢిల్లీలో కాంగ్రెస్ ఏమైనా అడ్డుకున్నదా? బీజేపీ వాళ్లు ఇక్కడ ఎందుకు అడ్డుకుంటున్నారు?' అని సీఎం ప్రశ్నించారు. రెండు రోజుల విరామం అనంతరం శీతాకాల సమావేశాలు పున:ప్రారంభం అయ్యాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మూసీ నది పునరుజ్జీవంపై బీఆర్ఎస్ పక్ష ఉపనేత హరీశ్‌రావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సభ్యులు బాలూనాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, శంకర్, కాలేరు వెంకటేశ్, రామ్మోహన్‌రెడ్డి, పాయల్ శంకర్ మాట్లాడారు. వారికి శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానం ఇచ్చే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాట్లాడారు.

మూసా, ఈసా నదుల సంగమం వద్ద మహాత్మా గాంధీ అస్థికలు కలిపిన చోట బాపూఘాట్ నిర్మించారనీ, కాకతీయుల నుంచి నిజాం నవాబుల వరకు సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి అనుగుణంగా ప్రాజెక్టులు కట్టారని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరానికి శాశ్వత వరద సమస్య పరిష్కారానికి నిజాం సర్కారు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ప్రాజెక్టులను నిర్మించిందని తెలిపారు. అవి ఇప్పటికీ హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. ఆ గర్భ శ్రీమంతుల ఫామ్‌హౌజ్‌ల డ్రయినేజీని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లలో కలుపుతుంటే ఉక్కుపాదం మోపి అడ్డుకున్నామన్నారు. తనను రియల్ ఎస్టేట్ బ్రోకరని, ఇంకా ఏదేదో అని విమర్శలు చేస్తున్నా పట్టించుకోకుండా ముందుకెళున్నామని చెప్పారు. రియల్ ఎస్టేట్ కూడా ఒక ఇండస్ట్రీ అనీ, దానికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీనిచ్చారు. ప్రపంచస్థాయి నగరాలన్నీ నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకుంటున్నాయనీ, లండన్ థేమ్స్ రివర్, న్యూయార్క్, జపాన్, సౌత్ కొరియా, సింగపూర్ పర్యటనల్లో తమకు ఇదే మిగితా 4వ పేజీలో

## 'వైట్ కాలర్ ఉగ్రవాదం' పెరుగుతోంది

- విద్యతో పాటు నైతిక విలువలు అవసరం
- ఉదయ్‌పూర్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

దేశంలో 'వైట్ కాలర్ ఉగ్రవాదం' అనే ప్రమాదకర ధోరణి వేగంగా పెరుగుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత విద్యావంతులైన కొందరు వ్యక్తులు దేశానికి, సమాజానికి వ్యతిరేకంగా పనిచేస్తుండటం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో భూపాల్ నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడును ప్రస్తావించిన రాజ్‌నాథ్ సింగ్, ఆ ఘటనలో భాగమైన వ్యక్తులు అత్యంత చదువుకున్నవారేనని తెలిపారు. "వైద్యులు రోగులకు ప్రిస్క్రిప్షన్‌పై 'ఆర్ఎక్స్' రాస్తారు. కానీ కొందరి చేతుల్లో ఆ 'ఆర్ఎక్స్' స్థానంలో 'ఆర్‌డీఎక్స్' ఉండటం దురదృష్టకరం. జ్ఞానంతో పాటు నైతిక విలువలు కూడా అత్యంత అవసరం" అని ఆయన వ్యాఖ్యానించారు.

విద్య అనేది కేవలం ఉద్యోగం లేదా వృత్తి సాధనకే పరిమితం కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి, సమాజ హితానికి దోహదపడాలని అన్నారు. నైతికత, ధర్మం, బాధ్యత లేకుండా విద్య అపూర?మేనని స్పష్టం చేశారు. అదేవిధంగా దేశంలో రక్షణ రంగంలో స్టార్టప్‌లు అద్భుతంగా ఎదుగుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. రానున్న 15 నుంచి 20 ఏళ్లలో ఆయుధాల తయారీలో భారత్ పూర్తిస్థాయి స్వావలంబన సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలు దేశ అభివృద్ధికి కీలకంగా మారనున్నాయని చెప్పారు.

ప్రస్తుతం భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, 2030 నాటికి మూడో స్థానానికి చేరుకునే దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ ప్రయాణంలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

భూపాల్ నోబుల్స్ విశ్వవిద్యాలయం స్థాపకుడు మేవాడ్ రాజా మహారాణా భూపాల్ సింగ్‌కు రాజ్‌నాథ్ సింగ్ నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యం అనంతరం తన రాజ్యాన్ని స్వచ్ఛందంగా భారతదేశంలో విలీనం చేసిన మహనీయుడిగా ఆయనను కొనియాడారు. మహారాణా భూపాల్ సింగ్ ఒక దూరదృష్టి గల పాలకుడిగా, దేశభక్తుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు.

## పలు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

- జీహెచ్‌ఎంసీలో 27 మున్సిపాల్టీలు విలీనానికి ఆమోదం
- రెండు ప్రయివేటు యూనివర్సిటీలకు అనుమతి
- గూడ్స్ వాహనాలకు జీవితకాలానికి పన్ను






బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వివిధ శాఖలకు సంబంధించిన పలు బిల్లులను శాసనసభ, శాసనమండలి ఆమోదించింది. మున్సిపల్ విద్యా, రవాణా, పంచాయతీ, ఎక్సైజ్ శాఖలకు సంబంధించిన చట్టాలకు పలు సవరణలను ప్రతిపాదిస్తూ ఆయా శాఖల మంత్రులు శాసనసభలో బిల్లులను ప్రవేశపెట్టారు. శుక్రవారం అసెంబ్లీలో పలు బిల్లులపై చర్చ జరిగింది. ముఖ్యమంత్రి తరుపున ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మున్సిపల్ చట్టానికి సవరణలు ప్రతిపాదించారు. తెలంగాణ ప్రయివేటు విశ్వవిద్యాలయ బిల్లుకు మంత్రి దామోదర రాజనర్సింహ, రవాణా చట్టానికి మంత్రి పొన్నం ప్రభాకర్ సవరణలు ప్రతిపాదించారు. వీటిపై బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు అభ్యంతరాలను లేవనెత్తారు. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ మున్సిపాల్టీల విలీనం, సిబ్బంది కొరతపై ప్రధానంగా ప్రస్తావించారు. గ్రేటర్‌లో విలీనం వల్ల పేదలు, మధ్యతగరతి వర్గాలపై పన్ను భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంద్రేష్, ఐవోలు గ్రామాలను గ్రేటర్‌లో కలపాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అస్థిత్వాన్ని దెబ్బతీయకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విలీనమవుతున్న మున్సిపాల్టీల్లో అదనపు పన్నుల భారం ఉండబోదని భరోసా ఇచ్చారు. దీని వల్ల సమర్థవంతమైన పౌర సేవలు అందుతాయని తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్‌ను సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామన్నారు. మౌలిక సదుపాయాలు, పౌరసేవల్లో అసమగ్రత ఉందనీ, ఈ చట్టం ద్వారా వాటిని సరి చేస్తామన్నారు. సుస్థిర అభివృద్ధి, సమగ్ర పట్టణాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని వివరించారు. మున్సిపాల్టీలపై వివిధ స్థాయిల్లో ప్రజల అభిప్రాయాలను తీసుకున్నట్టు తెలిపారు. విలీన ప్రక్రియతో గ్రామాల్లో ఉపాధి కోల్పోతున్నారనీ, ఈ రాష్ట్రంలో పేదలకు ఎలాంటి సాయం చేస్తున్నారంటూ బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా ఆక్షేపించారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీకి ఈ చట్టం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రతిపాదించిన తెలంగాణ ప్రయివేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తున్నదని సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయకుండా ప్రయివేటుకు ఊతం ఇవ్వడం సరైందికాదన్నారు. విద్యారంగంలోకి ప్రయివేటు సంస్థలను మిగితా 4వ పేజీలో

## సీఎం వ్యాఖ్యలు మూసీ కంటే కంపు



- ముఖ్యమంత్రి నోరు ప్రక్షాళన చేయాలి
- స్పీకర్ ఏకపక్ష వైఖరి, ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణి
- అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నాం : బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్
- గన్ పార్క్ వద్ద నిరసన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మూసీ నదికంటే ఎక్కువగా కంపుగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. శాసనసభలో మాట్లాడిన ఆయన, సభలో ఉన్న ప్రతి సభ్యుడికీ సమాన హక్కులు ఉంటాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌దేనని స్పష్టం చేశారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో ఏడు రోజులు సభ నిర్వహిస్తామని నిర్ణయించినట్లు చెప్పిన హరీశ్‌రావు, కానీ బీఏసీ మినిట్స్‌లో ఆ విషయం ఎక్కడా లేదని ఆరోపించారు. సభ అజెండా వివరాలు అర్ధరాత్రి 2 గంటలకు పంపితే సభ్యులు ఎలా సిద్ధమవుతారని ఆయన ప్రశ్నించారు.

అసెంబ్లీలో స్పీకర్ ఏకపక్ష వైఖరి, ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణికి నిరసనగా ఈ దఫా అసెంబ్లీ సమావేశాలను బీఆర్ఎస్ పార్టీ బహిష్కరిస్తోందని ప్రకటించారు. శుక్రవారం స్పీకర్ ఏకపక్షంగా సభను నడుపుతున్న తీరుకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్రజాస్వామిక, అసభ్యకర ప్రవర్తనకు తీరుకు నిరసనగా అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేసి వెళ్లిపోయారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ శాసనసభ నడుస్తున్న తీరు ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధంగా ఉందన్నారు. బీఏసీ సమావేశానికి తమను గంటన్నర సేపు ఆపి అవమానించారని చెప్పారు. సభను ఏడు రోజుల పాటు నడపాలనీ, ఆ తర్వాత మళ్లీ సమావేశమై తదుపరి షెడ్యూల్ నిర్ణయించాలని స్పష్టంగా అనుకున్నామని గుర్తు చేశారు. కానీ సభలో ప్రవేశపెట్టిన మినిట్స్‌లో మాత్రం సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ నిర్ణయానికే వదిలేస్తున్నామని తప్పుడు సమాచారం పొందుపరిచారని వివరించారు. స్పీకర్ సభను కస్టోడియన్‌లా కాకుండా, ఏకపక్షంగా నడుపుతున్నారని అన్నారు.

అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అని హరీశ్‌రావు చెప్పారు. ప్రశ్నోత్తరాల్లో 10 ప్రశ్నలుంటే, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తమ మైక్ కట్ చేశారని అన్నారు. పార్లమెంట్‌లో ప్రధాని మోడీని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించడంలేదా? ఇక్కడ తాము సీఎంను ప్రశ్నిస్తే మైక్ ఎందుకు ఆపేస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిని విమర్శించొద్దని స్పీకర్ తమకు చెప్పడం ఎక్కడి పద్ధతని అడిగారు. ప్రతిపక్షం మాట్లాడకూడదంటే అసలు సభ ఎందుకనీ, తమను ఎందుకు పిలిచినట్టని అన్నారు. సభలో సీఎం రేవంత్‌రెడ్డి బాడీ షేమింగ్ చేస్తూ మాట్లాడుతున్నారనీ, మిగితా 4వ పేజీలో

## 'గృహజ్యోతి'తో 52.82 లక్షల మందికి లబ్ధి

- శాసనమండలిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు లబ్దిదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనమండలిలో సభ్యురాలు విజయశాంతి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. రాష్ట్రంలోని 52,82,498 మంది లబ్దిదారులకు ప్రభుత్వం ఇప్పటివరకు రూ.3,593.17 కోట్లను విద్యుత్ సంస్థలకు చెల్లించిందని వివరించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 25,35,560 లక్షల మంది, ఎన్పీడీసీఎల్ పరిధిలో 27,46,938 లక్షల మంది ఉన్నారని తెలిపారు. బీజేపీ సభ్యులు ఏవీఎన్ రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు 18వ తారీఖున కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఒకటో తేదీన జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆర్థిక భారాన్ని వాయిదా వేసేందుకు ఉద్యోగుల ప్రయోజనాలు చెల్లించకుండా రిటైర్మెంట్ వయోపరిమితిని మూడేండ్లు గత ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం అన్నారు. "వయోపరిమితి పెంచకుంటే 2021 నుంచి 2023 మధ్య సంవత్సరాల్లో 26,854 మంది ఉద్యోగ విరమణ పొందే వారనీ, పెంపుతో కేవలం 6,354 మంది మాత్రమే రిటైర్ అయ్యారు. మా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పెన్షన్ బెనిఫిట్స్ రూ.1,752 కోట్లు చెల్లించాం. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు 6,244 కోట్లు ఉన్నాయనీ, వాటిని క్లియర్ చేసేందుకు ప్రతి నెలా రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నాం" అని తెలిపారు. ఉద్యోగుల మెటర్నిటీ, చైల్డ్ కేర్ లీవ్‌ల పెంపుపై పీఆర్సీ నివేదిక వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## కృష్ణా-గోదావరి జల వివాదాల పరిష్కారానికి కేంద్రం కమిటీ ఏర్పాటు

- తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య జలవివాదంపై కీలక అడుగు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కృష్ణా, గోదావరి నదుల జలాల పంపకాల విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న వివాదానికి పరిష్కారం చూపే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఈ సమస్యలపై సమగ్రంగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచించేందుకు కేంద్ర జలసంఘం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలసంఘం ఛైర్మన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు, కృష్ణా? మరియు గోదావరి నదీ యాజమాన్య బోర్డుల ఛైర్మన్లు, జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్, కేంద్ర జల కమిషన్ చీఫ్ ఇంజినీర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ కృష్ణా, గోదావరి నదులపై ఇరురాష్ట్రాల మధ్య ఉన్న జల పంపకాల వివాదాలు, ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక సమర్పించనుంది. దీని ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య దీరెకాలంగా కొనసాగుతున్న నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## కొత్త కార్పొరేషన్లకు శాశ్వత సిబ్బంది

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యులు తక్కళ్లపల్లి రవిందర్‌రావు, బండా ప్రకాష్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. గతంలో ఉన్న 13 కార్పొరేషన్లకు తోడు తమ సర్కార్ 8 కార్పొరేషన్లు, ఒక ఈబీసీ బోర్డు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమగ్రమైన ప్రణాళికతో కొత్త కార్పొరేషన్లకు శాశ్వత సిబ్బందిని నియమిస్తామన్నారు. ధోభీ, కుమ్మరి సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు వివరించారు. గత ప్రభుత్వం 42 బీసీ ఆత్మగౌరవ భవనాలకు స్థలాలు ఇచ్చినా, అభివృద్ధికి నిధులు కేటాయించలేదని గుర్తు చేశారు. మూడు భవనాల నిర్మాణ పనులు మధ్యలో ఉన్నాయని తెలిపారు. కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలన్నారు. పూర్తయిన కురుమ భవనంలో విద్యాసంస్థ, హస్టల్ ఏర్పాటులో కుల సంఘాల నాయకుల్లో విభేదాలు వచ్చాయని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా కుల సంఘాల భవనాల నిర్వహణ విషయంలో స్పష్టమైన విధివిదానాలను ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. బీసీ ప్రజా ప్రతినిధులతో శాసన సభ సమావేశాల్లోపు మీటింగ్ ఏర్పాటు చేసి. బీసీ సబ్ ప్లాన్, ఇతర అంశాలపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## 'మూసీ శుద్ధి కాదు.. దోపిడీ యజ్ఞం

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అక్రమ సంపాదనకు అడ్డుగా నిలుస్తున్న వారిపై కక్ష సాధిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ధ్వజమెత్తారు. మూసీ పునరుజ్జీవం పేరుతో ప్రజలను మభ్యపెట్టి భారీ దోపిడీకి తెరలేపుతున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డికి మూసీని శుభ్రం చేయాలన్న సంకల్పం కంటే తన స్వార్థం, లాభాపేక్షే ఎక్కువగా కనిపిస్తోందని విమర్శించారు. మూసీ నది కన్నా ముఖ్యమంత్రి మాట్లాడే భాషే ఎక్కువగా కలుషితంగా ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రాజెక్టు పేరుతో ప్రజలను మోసం చేస్తూ వేల కోట్ల రూపాయల దోపిడీకి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. డీపీఆర్ కూడా సిద్ధం కాకముందే వేల కోట్ల రూపాయల ఖర్చు ఎలా నిర్ణయించారని ప్రశ్నించారు. డీపీఆర్ సిద్ధం కాకముందే పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమని పేర్కొన్నారు. మూసీ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బుల్డోజర్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

మూసీ ప్రాజెక్టు పేరుతో బ్లాక్‌లిస్ట్ అయిన సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రెడ్ కార్నర్ నోటీసులు ఉన్న కంపెనీలకు పనులు అప్పగించాలనుకోవడం వెనుక పెద్ద కుట్ర ఉందని అన్నారు. మూసీ కాలుష్యానికి కారణమైనది కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలేనని పేర్కొన్న కేటీఆర్, నల్గొండ జిల్లాను దశాబ్దాల పాటు ఫ్లోరైడ్ సమస్యతో వేధించిన ఘనత ఆ పార్టీలదేనన్నారు. భగీరథ పథకం ద్వారా ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం చూపింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు.

గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తీసుకురావాలని సీఎం చెబుతున్నారని, ముందుగా అది నిజంగా గోదావరి నీరేనా కాదా స్పష్టత ఇవ్వాలని సవాల్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 16 వేల కోట్లతో మూసీ పునరుజ్జీవానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందని, ఇప్పుడు అదే ప్రాజెక్టును లక్ష కోట్లకు పైగా అంచనాలతో మార్చి దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మూసీకి అనుసంధానంగా 1100 కోట్లతో గండిపేటకు నీరు తరలించే ప్రణాళికలు రూపొందించామని, అలాగే ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్‌ను కూడా రూపొందించామని కేటీఆర్ గుర్తు చేశారు. మొత్తానికి మూసీ పునరుజ్జీవం పేరిట జరుగుతున్న ఈ ప్రక్రియ ప్రజల అభ్యుదయానికికాదు, అధికార దుర్వినియోగానికి మారిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

### 'కేసీఆర్‌ను ఉరి తీయాలంటే

## రేవంత్‌ను రెండుసార్లు ఉరి తీయాలి'



- కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఉరి తీయాల్సి వస్తే రేవంత్ రెడ్డిని రెండుసార్లు ఉరి తీయాల్సి ఉంటుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడిన కవిత, సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇటీవల అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దురుద్దేశపూరితమైనవని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆయన ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని రాజకీయంగా దెబ్బతీయాలనే ప్రయత్నమేనని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అక్రమాలకు పాల్పడిన వారిని డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నియమించడం అన్యాయమని అనానరు.

అలాగే, కేసీఆర్ మౌనం వీడి అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని కవిత పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎదుర్కొనే బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందని పేర్కొన్నారు. "కేసీఆర్ సభకు వస్తే అధికార పార్టీ నోరు మూసుకోవాల్సిందే" అని వ్యాఖ్యానించారు. పార్టీలో అంతర్గత విషయాలపై కూడా కవిత స్పందిస్తూ, బీఆర్ఎస్‌లో అర్హులకే పదవులు ఇవ్వాలని, యాదృచ్ఛికంగా నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై జరిగిన అక్రమాలపై సమాధానం చెప్పకుండా దృష్టి మళ్లించేందుకు ప్రయత్నించడం తగదన్నారు. అలాగే తెలంగాణ జాగృతి మళ్లీ ఉద్యమాత్మకంగా ముందుకు వస్తే ప్రభుత్వానికి కష్టాలు తప్పవని హెచ్చరించారు. చివరగా, తాను ఎమ్మెల్సీ పదవికి ఇప్పటికే రాజీనామా చేశానని, దాని పై చర్చించేందుకే అసెంబ్లీకి వచ్చినట్లు కవిత తెలిపారు.

## గిగ్ వర్కర్లకు శుభవార్త.. కేంద్రం నుంచి కొత్త నిబంధనలు

### కనీస వేతనం, బీమా, సామాజిక భద్రతకు మార్గం సుగమం





బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు సహా గిగ్ రంగంలో పనిచేస్తున్న కోట్లాది మందికి కనీస వేతనం, ఆరోగ్య బీమా, వృత్తిపరమైన భద్రత, సామాజిక భద్రత వంటి సౌకర్యాలు కల్పించే దిశగా నాలుగు ముసాయిదా నిబంధనలను కేంద్రం విడుదల చేసింది. గిగ్ వర్కర్ల సమస్యలపై ఇటీవల దేశవ్యాప్తంగా ఆందోళనలు, సమ్మెలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. సోషల్ సెక్యూరిటీ కోడ్-2020 కింద రూపొందించిన ఈ ముసాయిదా నిబంధనలను ప్రజాభిప్రాయం కోసం విడుదల చేసింది.


**గిగ్ వర్కర్లకు కీలక లబ్ధులు**

ఏడాదిలో కనీసం 90 రోజులు పనిచేసిన గిగ్ వర్కర్లు ఈ పథకానికి అర్హులు

ఆధార్ ఆధారిత నమోదు తప్పనిసరి

మిగితా 4వ పేజీలో

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**బలగం, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కూస ఓజయ్య (67) గత మూడు సంవత్సరాలుగా తీవ్రమైన వెన్నునొప్పి మరియు మోకాళ్ల నొప్పితో బాధపడుతూ, చికిత్స పొందుతనప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో మానసికంగా తీవ్రంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తేదీ 02.01.2026 తెల్లవారుజామున సుమారు 01:00 గంటల సమయంలో తన నివాస భవనంలోని ఫిల్లర్ హుక్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు బోయినిపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. మృతుని కుమారుడు కూస అంజయ్య (అంజిరెడ్డి) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

**బలగం టీవీ, హైదరాబాద్**



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కొల్లూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఎం. రమేష్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. నిత్యావసర సరుకుల కేసులో నిందితుడిగా ఉన్న ఫిర్యాదుదారుడి పేరును తొలగించేందుకు రూ.30 వేల లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ, అందులో భాగంగా గత నెల 17న రూ.5 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.మిగిలిన మొత్తాన్ని ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు శుక్రవారం కొల్లూర్ పోలీస్ స్టేషన్‌లోనే ఎస్ఐకి రూ.20 వేలు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



## కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారిణి రజిత.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత శుక్రవారం కోనరావుపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, రోగులకు అందుతున్న సేవలను ఆమె నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వారి ఆరోగ్య పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా గర్భిణీలకు అవగాహన కల్పించాలని, వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలైన ఎన్‌సీడీ, టీబీ నివారణ కార్యక్రమాల అమలు తీరుపై వైద్యాధికారులు డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ సురేష్‌లతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిరీ?త సమయంలోగా సాధించాలని స్పష్టం చేశారు.



## సైకిళ్ళు పంపిణీ

**బలగం, బోయినిపల్లి**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్ఫూర్తితో, వారి బాటలో సాగుతూ సైకిళ్ల పంపిణీ చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామంలో పదవ తరగతి విద్యార్థులకు బిజెపి మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురాం అధ్యక్షతన సైకిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

పరశురాం మాట్లాడుతూ: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థికీ సైకిళ్ల పంపిణీ మా సంకల్పమని తెలిపారు.ఆ తర్వాత స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే బండి సంజయ్ కుమార్ లక్ష్యమని పేర్కొన్నారు.సర్కారు బడుల విద్యార్థులు గల్లా ఎగరేసుకునేలా వారి భవితని తీర్చిదిద్దడమే మా కర్తవ్యమని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానువాడ సర్పంచ్ కట్ట గోవర్ధన్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నర్సింహచారి, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు దేవిక, ప్రైమరీ స్కూల్ రామచంద్రం, ఉప సర్పంచ్ జనగం జితేందర్, జనగం రమ, జనగం లక్ష్మణ్, బూత్ అధ్యక్షులు ఇల్లందల బాలయ్య, సారంపల్లి రాజు, ఇల్లందుల పరుశురాం, జనగం పరుశురాం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అతిపెద్ద నగరంగా అవతరించిన గ్రేటర్ హైదరాబాద్

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- చిక్కడపల్లి - దోమల గూడ లింక్ బ్రిడ్జి ప్రారంభం



**బలగం టీవీ, హైదరాబాద్**

గ్రేటర్ హైదరాబాద్ నగరం దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ బహత్ నగరంగా ఆవిర్భవించిన నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతత్వంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. జీహెచ్ఎంసీ నిధుల్లో నుంచి రూ.6 కోట్లతో హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలా మీదుగా నూతనంగా నిర్మించిన ' చిక్కడపల్లి – దోమల గూడ లింక్ బ్రిడ్జి'ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి శుక్రవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఓఆర్ఆర్ లోపల, ఓఆర్ఆర్‌ను అనుకుని ఉన్న పురపాలికల విలీనంతో విస్తీర్ణం జనాభా పరంగా గ్రేటర్ హైదరాబాద్ నగరం దేశంలోనే అతిపెద్ద నగరంగా అవతరించిందన్నారు. అతి పెద్ద నగరంలో జనాభాకు తగ్గట్టు రోడ్లు, డ్రైన్‌లు, వీధి దీపాలు, పార్కులు ఇతరత్రా మౌలిక సదుపాయాలు అభివద్ధికి సీఎం సమగ్ర ప్రణాళికలతో ముందుకుసాగుతున్నారని తెలిపారు. జిలా ఇన్‌చార్జి మంత్రిగా, స్థానిక ప్రజా ప్రతినిధులందరినీ సమన్వయం చేసుకుంటూ నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర స్టేట్‌హెడ్‌క్వార్టర్‌గా, క్యూర్ లోపలి ప్రాంతంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌ను ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అభివద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వీ కర్ణన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్‌లు, ఎస్ఈ మోహన్ రెడ్డి , ఈఈ రోహిణి, డీఈఈ రేణుక, ఏఈఈ ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

**హర్షం వ్యక్తం చేసిన స్థానికులు**

హుస్సేన్ సాగర్ నాలాపై జీహెచ్ఎంసీ నిధులు రూ.6 కోట్లతో చిక్కడపల్లి–దోమలగూడ లింక్ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో చిక్కడపల్లి నుంచి అశోక్‌నగర్ దోమలగూడ, లిబర్టీ మీదుగా సచివాలయానికి చేరుకునేం దుకు గతానికేంటే సగం తక్కువ సమయంలోనే వీలుకలుగుతుంది. బ్రిడ్జిని అందుబాటులోకి తేవడం పట్ల నాలా ఇరుపక్కల కాలనీల ప్రజల హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి కతజ్ఞతలు తెలిపారు.

## నూతన సంవత్సరం బూతు సంవత్సరంలాగా ప్రారంభమైంది

- మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**బలగం టీవీ, హైదరాబాద్**

నూతన సంవత్సరం బూతు సంవత్సరంలాగా ప్రారంభమైందని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం ఉదయం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సీఎం దగ్గర సబ్జెక్ట్ లేదనీ, సంగతీ లేదన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లేదు.. గానీ బూతులు ఎక్కువగా ఉన్నాయన్నారు. కేసీఆర్ గురించి ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. ఉరి తీయాలి అంటారనీ, సలహాలు ఇవ్వాలంటారన్నారు. రాష్ట్ర ప్రజల నుంచి కాంగ్రెస్ సర్కార్‌కు పూర్తి స్థాయి వ్యతిరేకత ఉందన్నారు. జూరాలలో ఇవాళ కూడా క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో నీటి విడుదల జరుగుతుందన్నారు. పక్క రాష్ట్రంతో ఉన్న సమస్యలు తెలంగాణ పట్ల సోయి ఉన్నోళ్లు, అవగాహన ఉన్నవాళ్ళు సలహాదారుగా ఉండాలి కానీ ఆదిత్యనాద్ దాస్ సలహాల తీసుకుని ఏపీకి నీళ్ళు దోచిపెడుతున్నారన్నారు. ఆంధ్ర వ్యక్తిగా తెలంగాణ ప్రాజెక్టులపై కేసులు వేసిన వ్యక్తిని సలహాదారుగా నియమించు కుంటారా..? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆదిత్యనాద్ దాస్‌ను తొలగించి తెలంగాణ వ్యక్తిని నియామించాలన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు. ట్రిబ్యునల్‌లో వాదనలు జరుగుతున్నాయనీ, నీటి వాటాల విషయంలో కేసీఆర్ చేసిన కషి ఫలితం తెలంగాణకు వాటా దక్కిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాత పాడుతున్నారన్నారు. బనకచర్ల ఎక్కడుందో కూడా తెలియని వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో కూడా తెలియదన్నారు. వితండ వాదం చేయకుండా సబ్జెక్ట్ తెలుసుకోవాలని హితవు పలికారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా తీయలేదనీ, పిచ్చి మాటలు మానేసి రేవంత్ రెడ్డి హుందాగా మాట్లాడాలన్నారు. రేవంత్‌రెడ్డికి ఈ ఏడాది మంచి బుద్ధి ఇవ్వాలలనీ, ఆయన గుణం మారాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

**డ్రామాలు చేస్తున్నారు : బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద**

ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడు దగ్గరికి వెళ్ళి వీడియోలు తీయించి అసెంబ్లీ ప్రారంభం కాకముందే ఆ వీడియో రిలీజ్ చేసి డ్రామాలు చేస్తున్నారని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ప్రతిపక్ష నాయకుడిపై బయట ఇష్టానుసారంగా మాట్లాడుతూ లోపల డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఇన్ని రోజుల సభలో ప్రతిపక్షం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ ప్రభుత్వం సమాధానం చెప్పలేదన్నారు. అధికార మదంతో కాంగ్రెస్ నేతలకు కండ్లు నెత్తికెక్కాయన్నారు. తాము మాట్లాడుతుంటే మైకులు కట్ చేస్తున్నారనీ, అడ్డుపడుతున్నారన్నారు. కేసీఆర్ గొంతుకై తాము మాట్లాడతామన్నారు. తప్పులు సరిదిద్దుకుని పాలన చేయడం చేతకాదన్నారు. బీహార్ వారి చేతిలో రాష్ట్రం పెట్టారని గతంలో రేవంత్ రెడ్డి మాట్లాడలేదా..? అని ప్రశ్నించారు. శాసనసభ జీరో అవర్‌తో స్టార్ట్ చేసి కొత్త సంప్రదాయానికి తెరలేపారన్నారు. తమ పార్టీ తరుపున ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## డ్రైనేజి పరిశుభ్రత పనులను పరిశీలించిన సర్పంచ్ మామిడి రాజు



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండి మురికినీరు పేరుకుపోయి దుర్గంధం వస్తుండడంతో శుక్రవారం ఇందిరమ్మ కాలనీని నూతన సర్పంచ్ మామిడి రాజు సందర్శించి వెంటనే స్పందించి సెప్టిక్ ట్యాంకర్ తెప్పించి డ్రైనేజీలో నిలిచిన మురుగు నీటిని, వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. పాలకవర్గం సహాయంతో గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత పైన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామని అందులో భాగంగా గ్రామంలోని అన్ని వాడలలోని డ్రైనేజీలు,పరిసరాలను పరిశుభ్రం చేపిస్తామని అన్నారు. అనంతరం కాలనీ వాసులు మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన మురికి నీరు,వ్యర్థాల వలన అనేక ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామని సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన వెంటనే తమ కాలనిలో మురికినీరు, వ్యర్థను తొలగించి తమకు ఉపశమనం కల్గించనందుకు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్,వార్డు మెంబర్లు రాకం సుమన్,ఎర్రోజు దీపికా రవితేజ, సిబ్బంది ఎలుక రాము, కాలనీ వాసులు తిప్పారపు శ్రీనివాస్, దాసు, చాంద్, విఠల్, రవి, ధనుంజయ్, రాజు మహిళలు పాల్గొన్నారు.

# కేకే మహేందర్ రెడ్డికి ప్రోటోకాల్ పోస్ట్ ఇవ్వాలి

## ఏఎంసీ చైర్మన్ షేక్ సబేర బేగం గౌస్



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు గాంధీభవన్ ఇన్చార్జి కుమార్ రావు ను సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి వినతి పత్రం ఇచ్చారు. సిరిసిల్ల శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తున్నారని ఆయనకు ప్రోటోకాల్ పోస్ట్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ గౌడ్‌ను కలవడానికి సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీభవన్ కు వచ్చారు. ఆ సమయంలో ఆయన లేకపోవడం నిజామాబాద్‌కు వెళ్లిపోగా గాంధీభవన్ ఇన్చార్జ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కుమార్ రావు ను కలిసి ప్రోటో కాల్ పోస్టు ఇవ్వాలని వారు వినతి పత్రం అందజేశారు. గాంధీభవన్ ఎదుట సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గంలోని తంగళ్ళపల్లి, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ వీర్నపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కమిటీ రాష్ట్ర కమిటీ నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ లు వైస్ చైర్మన్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు పాలకవర్గ సభ్యులు నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఉపసర్పంచ్లు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాలలో పనిచేస్తున్న నాయకులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎఎంసి చైర్మన్ షేక్ సబేర బేగం గౌస్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న లేకపోయినా పనిచేస్తున్నామని సిరిసిల్ల ప్రస్తుత బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తనయుడు కేటీఆర్ పై పోటీ చేసే సత్తా కలిగిన నాయకుడు కేకే మహేందర్ రెడ్డి అని అతనికి ప్రోటోకాల్ పోస్ట్ ఇచ్చినట్లయితే కేకే మహేందర్ రెడ్డిని సిరిసిల్ల నియోజకవర్గం నుండి 30 వేల మెజార్టీతో గెలిపిస్తామని కేటీఆర్ ను చిత్తు చిత్తుగా ఓడిస్తామని వారు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గంలో మరింత బలపడాలంటే కేకే మహేందర్ రెడ్డి కి ప్రోటోకాల్ పోస్టు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ పరిధిలో కేటీఆర్ అధికార బలంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల స్థాయి నాయకులపై పోలీసులతో అనేక అక్రమ కేసులు బనాయించారని గత పది సంవత్సరాలుగా ఆ కేసుల విషయంలో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్నామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ గౌడ్?, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసులపై న్యాయ సలహా తీసుకొని కొట్టి వేయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చక్రధర్ రెడ్డి,ఏ ఎం సి చైర్మన్లు షేక్ సాభేరా బేగం, స్వరూప రెడ్డి, తలారి రాణి నర్సింలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్ రెడ్డి, భూక్య రామ్ రెడ్డి, మాజీ చైర్మన్ రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ బాయి, మిర్యాలకర్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారాయణపురం సర్పంచ్ దొమ్మాటి నరసయ్య, ఎల్లారెడ్డిపేట వీర్నపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, భూత శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షులు చెన్న బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డి, కదిరే శ్రీనివాస్ గౌడ్, షకీల్, ఏఎంసీ పాలకవర్గం నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గంలో నుంచి సుమారు 400 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట మండలంలోని జవారిపేట గ్రామ శివారులో ఒక గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైంది. శనివారం గ్రామ శివారు ప్రాంతంలో మృతదేహం ఉన్నట్లు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థలానికి చేరుకున్న ఎస్ఐ సిరిసిల్ల అశోక్ మృతదేహాన్ని పరిశీలించారు. మరణించిన మహిళ వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని ఆయన తెలిపారు. మృతురాలి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, ఎవరైనా ఈ మహిళను గుర్తుపట్టినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ మహిళ గురించి ఎలాంటి సమాచారం తెలిసినా లేదా ఆచూకీ తెలిసిన వారు ఇల్లంతకుంట ఎస్ఐ సెల్ నెంబర్: 8712656372 కు సంప్రదించాలని ఎస్ఐ అశోక్ విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



# మాజీ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి.ా కాంగ్రెస్ పార్టీ నాయకులు, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ ఇప్పపూల అజయ్ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఇప్పపూల అజయ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి పూల బొకే అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొత్త ఏడాదిలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎల్లప్పుడూ ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల పరామర్శ

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ నియోజకవర్గం, చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో అనారోగ్యంతో మరణించిన ఎగుమామిడి గంగా రెడ్డి మరియు దారం గంగా రాజిరెడ్డి కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. గ్రామంలో పర్యటించిన ఆయన, మృతి చెందిన వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో పార్టీ మరియు నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గంగా రెడ్డి మరియు రాజిరెడ్డిల మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఏనుగు మనోహర్ రెడ్డి తో పాటు దారం బాల్ రెడ్డి, గసికంటి కిషన్, నేతికుంట రాజు, కనగర్తి సత్తయ్య, పుల్లూరి రాజు, గసికంటి పర్ష రాములు, బొడిగె అనిల్ గౌడ్, దేవరాజు మరియు ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హోంగార్డ్ మధుకు ఆత్మీయ వీడ్కోలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డ్‌గా 31 సంవత్సరాల పాటు నిరంతర సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న ఎన్. మధును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లా అదనపు ఎస్పీ (ఏఎస్పీ) చంద్రయ్య గారు మధు కు పూలమాల వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో విధులు నిర్వహించి, అందరి మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. "పోలీసు రిటైర్మెంట్ అనేది కేవలం వృత్తికే కానీ, వ్యక్తిత్వానికి కాదు" అని ఆయన కొనియాడారు. మధు అందించిన సుదీర్ఘ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా, సంతోషంగా గడపాలని ఏఎస్పీ ఆకాంక్షించారు. విరమణ తర్వాత కూడా ఎలాంటి సమస్య వచ్చినా, ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని ఆయన భరోసా ఇచ్చారు.



# క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించిన మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్ రావు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేటలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ను శుక్రవారం మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్ రావు ఆవిష్కరించారు. స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఎల్లారెడ్డిపేట ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంప్రదాయంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈ ఏడాది కూడా ఘనంగా జరగనున్నాయి. మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ.. జనవరి 11వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు, పండుగ వేళ అందరినీ ఏకం చేసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు మాద ఉదయ్ కుమార్, క్లబ్ అధ్యక్షులు ఎం.డి ఆసిఫ్, సభ్యులు ముద్రకోల దేవరాజు , ఎం.డి అఫ్రోజ్ ,ఎం.డి అస్లాం, మామిండ్ల సాయిభాను, కొడిమ్యాల సాయిరాం,ఎర్రవెల్లి వంశీ చారి, ఎం.డి ఇమ్రాన్,ఎం.డి సమీర్, ముద్దుల నవీన్, కొత్త అరుణ్, మంగురపు వెంకటేష్, పారిపెల్లి భాస్కర్ పాల్గొన్నారు.

# చలితో ముప్పు..


- గుండె, మెదడు, శ్వాసకోశ సమస్యలు ఎక్కువ
- వ్యాధులపై అవగాహన కల్పించిన మెడికవర్ వైద్యులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

చలికాలంలో గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని కరీంనగర్ మెడికవర్ వైద్యులు తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో చలికాలంలో వచ్చే వివిధ వ్యాధులపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చలితో రక్తం చిక్కగా మారడం, రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల గుండెపై, మెదడుపై ఒత్తిడి పెరిగి హార్ట్, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంటుందని వివరించారు. చలికాలంలో ఆల్కహాల్ సేవించడం, తక్కువగా నీళ్లు తాగడం కూడా ప్రమాదకరమని, షుగర్, బీపీ స్థాయులు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. వృద్ధులు, పిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైరిస్ పేషెంట్లలో చిన్న ఇన్‌ఫెక్షన్స్ కూడా నంజులాగా తయారై ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లే ప్రమాదముందన్నారు. స్వంత వైద్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడాలన్నారు. ఎలాంటి ఎమర్జెన్సీ వ్యాధులకైనా మొదటి గంట గోల్డెన్ అవర్ అని ఆ సమయంలో ఆసుపత్రికి తీసుకువస్తే రిస్కు తక్కువగా ఉండి ప్రాణాలు కాపాడేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. మెడికవర్ ఆసుపత్రిలో మల్టీ ఆర్గన్ ఫెయిల్యూర్ కేసులకు చికిత్స అందించేందుకు అర్హత కలిగి 24 గంటల పాటు పనిచేసే 45 మంది




వైద్యులు, క్రిటికల్ కేర్ వైద్యులతో కూడిన 5 ఐసీయూలు, ఎమర్జెన్సీ టీం కలిగిన ప్రత్యేక ఎమర్జెన్సీ విభాగం, 30 మంది కన్సల్టెంట్లు, డయాలసిస్, సిటీస్కాన్, ఎంఆర్ఐ వంటి సదుపాయాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్టు డాక్టర్ అనీష్‌పబ్బ, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ ఉపెందర్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, ఎమర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ సత్యనారాయణ, మార్కెటింగ్ మేనేజర్ కోట కరా?కర్, లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.



# మహంకాళి అమ్మవారి వార్షికోత్సవం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

గంభరావుపేటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహంకాళి అమ్మవారి వార్షికోత్సవంలో గంభీరావుపేట్ ఎమ్మార్వో మారుతి రెడ్డి, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. తీర్థప్రసాదాల అందుకున్నారు. అనంతరం వారిని రెడ్డి సంఘం నాయకులు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు గుళ్ళపల్లి నరసింహారెడ్డి గారు మరియు గడ్డిమీద ప్రసాద్ రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు ముత్యాల రాజిరెడ్డి, నెవురి రాజేందర్ రెడ్డి ,లక్కిరెడ్డి సంతోష్ రెడ్డి, చల్ల కృష్ణారెడ్డి, కోమటిరెడ్డి విజేందర్రెడ్డి, లక్కిరెడ్డి, రమేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, నెవురి సత్యం రెడ్డి,

